Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

గురువారం 08-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 214 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## అధికార కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసేది ఇలాగే!




రాబోయే మున్సిపల్ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహిస్తారన్న వార్తల నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. శాసనసభలో గంట పాటు ఇద్దరు నేతలు సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీల్లో వార్డులు, కార్పొరేషన్లలో డివిజన్ల అభ్యర్థుల ఎంపిక, విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణ, ఎన్నికల నిర్వహణపైనా చర్చించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విషయంలో డివిజన్, వార్డు అభ్యర్థుల ఎంపికను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం ప్రతి వార్డు, డివిజన్ నుంచి ఆరుగురు చొప్పున అభ్యర్థుల ప్రతిపాదనలను స్వీకరించి ఒకసర్వే నిర్వహించి సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల పేర్లను డీసీసీలు, టీపీసీసీలకు పంపిస్తే తుది జాబితాను ప్రకటిస్తుంది.

8న గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం

మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను సాధించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ చర్చించారు. దీంతోపాటు ప్రధానంగా 8న గాంధీభవన్ లో జరిగే టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై నేతల మధ్య చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసిందని, పథకం పేరు మార్చడంపై చేయాల్సిన ఆందోళన కార్యక్రమాల గురించి రేవంత్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ చర్చించారు.

## తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం




ఈ ఏడాది అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్న తమిళనాడులో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అధికార డీఎంకేను గద్దె దించేందుకు ఏకతాటిపైకి రావాలనే వ్యూహంతో ప్రతిపక్షలు పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఎన్డీఏ కూటమిలోకి పట్టాలి మక్కల్ కట్చి పార్టీ చేరింది. బుధవారం AIADMK అధినేత, ఆ రాష్ట్ర మాజీ సీం పళనిస్వామితో పీఎంకే అధినేత అన్బుమణి రామదాస్ భేటీ అయ్యారు.




## అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు ఇవే

- ఐదు రోజుల అసెంబ్లీ సమావేశాలు ఉ 13 బిల్లులకు ఆమోదం
- ఉపాధి హామీ, పాలమూరు రంగారెడ్డి అంశాలపై తీర్మాణాలు
- నీటిపారుదలపై సభలో కీలక చర్చ
- సుదీర్ఘ విరామం తర్వాత అసెంబ్లీకి కేసీఆర్ హాజరు
- మూసీ ప్రక్షళనపై అధికారఉవిపక్షల మధ్య వాగ్వాదం
- స్పీకర్ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ బహిష్కరణ
- ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- రికార్డు స్థాయిలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్

మిగతా 2 లో

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ముగిసాయి. శాసనసభను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్? నిరవధికంగా వాయిదా వేశారు. శాసనసభ ఐదు రోజుల పాటు సాగిన సమావేశాలు మంగళవారం రాత్రి ముగిసాయి. మొత్తం ఐదు రోజులు జరగ్గా 13 బిల్లులు ఆమోదించారు. ఇందులో ప్రభుత్వం రెండు తీర్మానాలు చేసింది. నాలుగు అంశాలపై స్వల్ప కాలిక అంశాలపై చర్చించారు. శాసనమండలి కూడా ఐదు రోజుల పాటు సాగింది. శాసనమండలి కూడా నిరవధికంగా వాయిదా పడింది. అసెంబ్లీ మొత్తం ఐదు రోజులు 40 గంటల 45 నిమిషాలు జరిగినట్లుగా స్పీకర్ ప్రకటించారు.

## ఎయిర్‌పోర్టులో హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత




హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లో మరోసారి మత్తు పదార్థాల కలకలం చోటుచేసుకుంది. అక్రమంగా తరలిస్తున్న హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు బుధవారం ఉదయం పట్టుకున్నారు. జనవరి 7న ఫుట్ దేశం నుంచి శంషాబాద్‌కు వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఈ గంజాయిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## కేసీఆరే గెలవాలని 90 శాతం వైసీపీ క్యాడర్ కోరుకుంటోంది !




వైసీపీ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ వైసీపీ క్యాడర్ కేసీఆర్ గెలవాలని కోరుకుంటున్నట్లు షాకింగ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కేతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ ఓటమిపై కీలక వ్యాఖ్యలు చేసిన కేతిరెడ్డి, గులాబీ పార్టీ ప్రస్తావన కూడా తీసుకువచ్చారు. 80 నుంచి 90 శాతం గులాబీ క్యాడర్, ఏపీలో వైసీపీ పార్టీ గెలవాలని కోరుకుంటోందని వెల్లడించారు.అదే సమయంలో 80 నుంచి 90 శాతం వైసీపీ కార్యకర్తలు కూడా తెలంగాణలో గులాబీ పార్టీ గెలవాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

## పెళ్లైన ఏడాదిన్నరకే.. భార్య వంట చేయడం లేదని విడాకులు కోరిన భర్త.. హైకోర్టు కీలక తీర్పు




పెళ్లంటే నూరేళ్ల పంట అని పెద్దలు అంటుంటారు. భార్యభర్తలు కష్ట సుఖాల్లో ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ కలకలా జీవించాలని సూచిస్తుంటారు. కానీ, నేటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వివాహం మున్నాళ్ల ముచ్చటగా మారుతోంది. ఆర్థిక కారణాలు, కుటుంబ కలహాలు, అక్రమ సంబంధాలు, అయిష్టం ఇలా రకరకాల కారణాలతో వివాహబంధాలను తెంపుకుంటున్నాయి కొన్ని జంటలు. మరికొందరైతే చిన్న చిన్న కారణాలతో విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. తాజాగా హైదరాబాద్ లో ఓ వ్యక్తి తన భార్య వంట చేయడం లేదని, తనను హింసిస్తుందని పెళ్లైన ఏడాదిన్నరకే విడాకులు కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆ వివరాలు మీకోసం..

ఎల్బీనగర్‌కు చెందిన ఒక వ్యక్తి భార్య వంట చేయడం లేదని, తన తల్లి వంట చేసేటప్పుడు భార్య సహకరించడం లేదని, ఇది క్రూరత్వం, హింసించడం కిందికి వస్తుందని కోర్టుకు విన్నవించాడు. తనకు విడాకులు మంజూరు చేయాలంటూ చేసిన అభ్యర్థనను కింది కోర్టు గతంలో కొట్టేసింది. సదరు భర్త కింది కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేశారు. దీనిని జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ నగేశ్ భీమపాకతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించి ఇటీవల కీలక తీర్పు వెలువరించింది.

## దమ్ముంటే రా.. నీ కోసం వెయిట్ చేస్తున్నా!




ట్రంప్ హెచ్చరికలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. కొలంబియా తన పద్ధతి మార్చుకోకపోతే మదురో గతే పడుతుందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు పెట్రో సవాల్ విసిరారు. 'రా.. దమ్ముంటే మదురో మాదిరిగా నన్ను తీస్కుళ్లు.. నీ కోసం వెయిట్ చేస్తున్నా' అంటూ సంచలన కామెంట్స్ చేశారు. తమ దేశంపై అమెరికా సైనిక చర్య చేపడితే తీవ్ర పరిణామాలుంటాయని వార్నింగ్ ఇచ్చారు. తాను ఆయుధం పట్టుకోనని గతంలో ప్రమాణం చేశానని, కానీ తమ మాతృభూమి కోసం అవసరమైతే మళ్లీ ఆయుధాలు చేపట్టేందుకు వెనకాడబోనన్నారు.

గెరిల్లా యుద్ధమే..

'నన్ను బెదిరించొద్దు. నేను మీ కోసం ఇక్కడే వేచి ఉన్నాను. నేను దండయాత్రలను, క్షపణులను, హత్యలను అంగీకరించను.మా రైతులపై బాంబులు వేస్తే.. వేలాది మంది గెరిల్లాలు ఉద్యమిస్తారు. ఎంతగానో అభిమానించే ప్రెసిడెంట్‌ను నిర్బంధిస్తే ప్రజలు చూస్తూ ఉండలేరు.. ఆగ్రహిస్తారు' అని చెప్పారు. అలాగే కొలంబియన్లు రాజకీయ మాఫియాల చేతిలో మోసపోవడం ఆపాలని పెట్రో పిలుపునిచ్చారు. 7లక్షల మంది కొలంబియా ప్రజల మరణాలకు కారణమైన వారు (అమెరికన్లు).. ప్రపంచంలోనే అత్యంత అసమానతలతో కూడిన దేశంగా మార్చారని ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ.. మరో 26 మంది లొంగుబాటు




### ఎమ్మెల్సీ తండ్రికి, ఎమ్మెల్యే కొడుకుకు నోటీసులు




### ల్యాండ్ పూలింగ్‌లో ఉద్రిక్తత.. రాజధానిని చట్టబద్ధత చేయాలని డిమాండ్




### పాతబస్తీలో ఉద్రిక్తత.. భద్రతా దళాలపై రాళ్లు రువ్విన నిరసనకారులు





### ఏపీ బస్సు ప్రమాదం..డ్రైవర్ అప్రమత్తతో 10 మంది సేఫ్..!




### వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.. ఎమ్మెల్యే షాకింగ్ కామెంట్స్




### ఆందోళనకారులపై దూస్కెళ్లిన బస్సు.. పది మంది మృతి



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం


## ల్యాండ్ పూలింగ్‌లో ఉద్రిక్తత.. రాజధానిని చట్టబద్ధత చేయాలని డిమాండ్

ఏపీ రాజధాని అమరావతి లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజధాని విస్తరణలో భాగంగా వడ్డమాను గ్రామంలో సీఆర్డీఏ అధికారులు ల్యాండ్ పూలింగ్ కొనసాగుతోంది. ఈ మేరకు వడ్డమాను గ్రామంలో సభ నిర్వహించారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్‌పై అవగాహన కల్పించి రైతులు నుంచి భూమిని సమీకరిస్తున్నారు. అయితే రైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. అమరావతి చట్టబద్ధతపై అధికారులను నిలదీస్తున్నారు. ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధానిని కేంద్రం నోటిఫై చేసేందుకు ప్రయత్నిసోందని రైతులకు మంత్రి నారాయణ వివరించారు. రాజధాని మార్పు అనేదే ఉత్పన్నం కాదని భరోసా కల్పించారు. ఇక రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. కుటుంబానికి లక్ష 50 వేల వరకూ రుణమాఫీ చేస్తామని రైతులకు మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

ఎకరాకు రూ. 5 లక్షలు ఇవ్వాలని రైతుల డిమాండ్

అయితే మూడేళ్లలో తమ భూములు అభివృద్ధి చేయలేకపోతే ఎకరాకు రూ. 5 లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు అంటున్నారు. మరోవైపు మొదటి విడత అభివృద్ధి ఎంత వరకు జరిగిందని ప్రశ్నించారు. అమరావతిలో ఏ రకమైన అభివృద్ధి జరిగిందని నిలదీశారు. ల్యాండ్ పూలింగ్ ప్రయోజనాలకు రైతులకు వివరిస్తూ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో సీఆర్డీఏ అధికారులు భూమిని సేకరిస్తున్నారు.

## తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం.. ఎన్డీయే లో చేరిన పీఎంకే

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా పళినిస్వామితో కలిసి రామదాస్ ఉమ్మడిగా మీడియాతో మాట్లాడుతూ ఏఐడీఎంకేతో పొత్తు కుదిరిందని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో తామంతా కలిసి పోటీ చేస్తామని తమిళనాడులో తప్పకుండా ఎన్డీయే విజయం సాధించబోతోందని రామదాస్ ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షలు ముక్కలు ముక్కలుగా చీలిపోవడం వల్లే గతంలో డీఎంకే విజయం సాధించందని ఇక అలా జరగకూడదనే పళనిస్వామి నాయకత్వంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం అవుతున్నాయని చెప్పారు.

మాది విక్టరీ అలయెన్స్: పళని స్వామి

రామదాస్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన పళని స్వామి రాబోయే అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్ డీఏలో పీఎంకే చేరిందని చెప్పారు. తాము ఇప్పటికే బీజేపీతో పెట్టుకున్నామని త్వరలోనే మరికొన్ని పార్టీలు తమ కూటమిలో చేర్చుకుంటామని మాది 'విక్టరీ అలయెన్స్' అని ప్రకటించారు. మరోవైపు యాక్టర్ విజయ్ స్థాపించిన పార్టీ టీవీకేను ఎన్?డీఏలో చేర్చుకునేందుకు బీజేపీ సీరియస్ గా ప్రయత్నిస్తోందనే ప్రచారం జరుగుతున్న వేళ విపక్ష కూటమిలోకి తాజాగా పీఎంకే వచ్చి చేరడం ఆసక్తిగా మారింది. అయితే స్టాలిన్ నేతృత్వంలో అధికార డీఎంకే పార్టీని ఓడించేందుకు ప్రతిపక్షలు కలిసి రావాలని ముఖఅయంగా విజయ్ మాతో కలిసి వచ్చినా కలుపుకుపోతామని గతంలో పళనిస్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో పొత్తుల విషయంలో విజయ్ ఎలాంటి డిసిషన్ తీసుకుంటారు అనేది వేచి చూడాలి. ఓ వైపు పొత్తులతో ప్రతిపక్షలు దూసుకువస్తుంటే సీఎం స్టాలిన్ విపక్ష కూటమిని ఎలా డిఫెన్స్ చేయబోతున్నారో చూడాలి.

## పాతబస్తీలో ఉద్రిక్తత.. భద్రతా దళాలపై రాళ్లు రువ్విన నిరసనకారులు


దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నగరంలోని పాతబస్తీలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. అధికారులపై దాడికి సైతం యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, భద్రతా బలగాలు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశాయి. ఒకానొక దశలో భద్రతా బలగాలపై కూడా నిరసనకారులు రాళ్లు రువ్వారు. దీంతో పరిస్థితిని అదుపు చేసేందుకు టియర్ గ్యాస్ ప్రయోగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు.. ఢిల్లీలో వాతావరణ కాలుష్యం అంతకంతకూ దిగజారుతోంది. గాలిలో ప్రమాణాలకు మించి ప్రమాదకరమైన విషవాయువులు వ్యాపిస్తున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. గొంతు మంట, ఊపిరి తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

## ఏపీ బస్సు ప్రమాదం..డ్రైవర్ అప్రమత్తతో 10 మంది సేఫ్..!

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు హైవేపై బస్సు దగ్ధం అయిన సంగతి తెలిసిందే. ఖమ్మం నుంచి విశాఖ వెళ్తున్న ఆర్ఆర్ఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే బస్సు అగ్నిప్రమాదానికి గురైందట. ఇక ఈ బస్సు ప్రమాద ఘటనపై డ్రైవర్ సైదులు స్పందించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు ఎగసిపడ్డాయని పేర్కొన్నారు డ్రైవర్. అప్రమత్తమై ప్రయాణికులను కిందికి దింపేసినట్లు వెల్లడించారు.

మొదట గామన్ బ్రిడ్జి వద్ద అరగంట భారీ ట్రాఫిక్ జామ్ చోటు చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో బస్సు అక్కడే చిక్కుకుపోయిందని తెలిపారు. ఇక ఆ తర్వాత కొంత ముందుకు వెళ్ళగానే ఒక్కసారిగా బస్సులో మంటలు వచ్చినట్లు తెలిపాడు డ్రైవర్ సైదులు. వెంటనే మా సిబ్బందిని అలెర్ట్ చేయడంతో వారు ప్రయాణికులు అందరినీ కిందకి దింపినట్లు తెలిపారు. అలా దాదాపు పది మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడట సైదులు. దీంతో సైదులుపై సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది.

## అధికార కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసేది ఇలాగే!



రాబోయే మున్సిపల్ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహిస్తారన్న వార్తల నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. శాసనసభలో గంట పాటు ఇద్దరు నేతలు సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. మున్సిపాల్టీల్లో వార్డులు, కార్పొరేషన్లలో డివిజన్ల అభ్యర్థుల ఎంపిక, విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణ, ఎన్నికల నిర్వహణపైనా చర్చించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విషయంలో డివిజన్, వార్డు అభ్యర్థుల ఎంపికను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం ప్రతి వార్డు, డివిజన్ నుంచి ఆరుగురు చొప్పున అభ్యర్థుల ప్రతిపాదనలను స్వీకరించి ఒకసర్వే నిర్వహించి సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల పేర్లను డీసీసీలు, టీపీసీసీలకు పంపిస్తే తుది జాబితాను ప్రకటిస్తుంది.

8న గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం

మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను సాధించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ చర్చించారు. దీంతోపాటు ప్రధానంగా 8న గాంధీభవన్ లో జరిగే టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై నేతల మధ్య చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసిందని, పథకం పేరు మార్చడంపై చేయాల్సిన ఆందోళన కార్యక్రమాల గురించి రేవంత్ రెడ్డి, మహేశ్?కుమార్ గౌడ్ చర్చించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కృష్ణా, గోదావరి జలాల పీపీటీ విషయంపై ఇరువురు చర్చించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అంశంలో ప్రభుత్వం ప్రజలకు మంచి సమాచారాన్ని అందించిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

## అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు ఇవే

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశాల్లో ఉపాధి హామీ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై రెండు తీర్మాణాలు చేసి కేంద్రానికి పంపించారు. 66 మంది సభ్యులు వివిధ అంశాలపై మాట్లాడారు. 82 మంది సభ్యులు ప్రశ్నోత్తరాల్లో భాగంగా తమ ప్రశ్నలను ప్రభుత్వంపై సందించారు. గత నెల 29 సోమవారం అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అసెంబ్లీకి సుదీర్ఘ విరామం తర్వాత ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. మొదటి రోజున దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మరెడ్డిల మృతికి సభ సంతాపం తెలిపింది. అనంతరం సభలో జీరో అవర్ ను చేపట్టారు. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ దగ్గరకు వెళ్లి పలకరిచండం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అయితే సంతాప తీర్మానాల మధలోనే కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోవడంపై అధికార ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. సభలో మూడుంటే మూడు నిమిషాలు కేసీఆర్ లేకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రశ్నోత్తరాల్లో మూసీ ప్రక్షళన మీద అధికార, విపక్షల మధ్య వాడివేడీ చర్చ జరిగింది. సీఎం విపక్షల తీరును ఎండగట్టారు. మరోవైపు సభను స్పీకర్ ఏకపక్షంగా నడుపుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక ప్రవర్తనకు నిరసనగా.. ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. సభ నుంచి వాకౌట్ చేసింది.

13 బిల్లులకు ఆమోదం

సభలో 13 బిల్లులపై చర్చించి ఆమోదించారు. దీనిలో జీహెచ్ఎంసీ సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ రెండో సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణ చేశారు. తెలంగాణ ప్రైవేటు యూనివర్శిటీల బిల్లు, తెలంగాణ మోటార్ వెహికిల్స్ టాక్సేషన్ బిల్లులు సభలో చర్చించారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై తీర్మానంపై చర్చ జరిగింది. కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని, పాత చట్టాన్ని యథతథంగా కొనసాగించాలని సభ తీర్మానం చేసింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జిల్లాలపై , పోవలరం నల్లమల సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వోద్దు అంటూ తీర్మాణం చేసి కేంద్రానికి పంపించారు. ఉపాధి హామీని వ్యతిరేకిస్తూ పాత చట్టాన్ని పునరుద్దరించాలని తీర్మానించారు. కీలకమైన అంశం నీటిపారుదల రంగంపై సభలో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా నదీజలాలు, బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను ఆయన వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి, కృష్ణా నదీ జలాలపై ప్రసంగించారు. పాలమూరు రంగారెడ్డికి ప్రాజెక్టుకు కేంద్ర అనుమతి ఇవ్వాలని సభలో తీర్మానం చేశారు. శాసనసభలో నాలుగో రోజు రికార్డు స్థాయిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ కొనసాగింది. దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్థావించారు.

## దమ్మింటే రా.. నీ కోసం వెయిట్ చేస్తున్నా!

ట్రంప్ హెచ్చరికలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. కొలంబియా తన పద్ధతి మార్చుకోకపోతే మదురో గతే పడుతుందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు పెట్రో సవాల్ విసిరారు. 'రా.. దమ్మింటే మదురో మాదిరిగా నన్ను తీసుకెళ్లు.. నీ కోసం వెయిట్ చేస్తున్నా' అంటూ సంచలన కామెంట్స్ చేశారు. తమ దేశంపై అమెరికా సైనిక చర్య చేపడితే తీవ్ర పరిణామాలుంటాయని వార్నింగ్ ఇచ్చారు. తాను ఆయుధం పట్టుకోనని గతంలో ప్రమాణం చేశానని, కానీ తమ మాతృభూమి కోసం అవసరమైతే మళ్లీ ఆయుధాలు చేపట్టేందుకు వెనకాడబోనన్నారు.

గెరిల్లా యుద్ధమే..

'నన్ను బెదిరించొద్దు. నేను మీ కోసం ఇక్కడే వేచి ఉన్నాను. నేను దండయాత్రలను, క్షపణులను, హత్యలను అంగీకరించను.మా రైతులపై బాంబులు వేస్తే.. వేలాది మంది గెరిల్లాలు ఉద్యమిస్తారు. ఎంతగానో అభిమానించే ప్రెసిడెంట్‌ను నిర్బంధిస్తే ప్రజలు చూస్తూ ఉండలేరు.. ఆగ్రహిస్తారు' అని చెప్పారు. అలాగే కొలంబియన్లు రాజకీయ మాఫియాల చేతిలో మోసపోవడం ఆపాలని పెట్రో పిలుపునిచ్చారు. 7లక్షల మంది కొలంబియా ప్రజల మరణాలకు కారణమైన వారు (అమెరికన్లు).. ప్రపంచంలోనే అత్యంత అసమానతలతో కూడిన దేశంగా మార్చారని ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రంప్ ఏమన్నారంటే..

వెనిజులాలో వైమానిక దాడులు నిర్వహించి నికోలస్ మదురోను బంధించిన రెండు రోజుల తర్వాత కొలంబియాపై సైనిక చర్య గురించి ట్రంప్ బహిరంగంగా ప్రస్తావించారు. కొలంబియాను అనారోగ్యంతో బాధపడుతున్న దేశంగా అభివర్ణించారు. కొలంబియా నాయకత్వం యునైటెడ్ స్టేట్స్‌లో కొకైన్ వాణిజ్యాన్ని పెంచుతోందని ఆరోపించారు. గుస్తావో పెట్రో పేరును స్పష్టంగా ప్రస్తావిస్తూ.. మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణాలో పాల్గొన్న ఒక రోగి దేశాన్ని నడుపుతున్నారని వ్యాఖ్యానించడం ఇరు దేశాల మధ్య అగ్గి రాజేసింది.


## పెళ్లైన ఏడాదిన్నరకే.. భార్య వంట చేయడం లేదని విడాకులు కోరిన భర్త.. హైకోర్టు కీలక తీర్పు

మొదటి పేజీ తరువాయి

భర్త దాఖలు చేసిన విడాకుల అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసింది. భార్య వంట చేయకపోవడం క్రూరత్వం కిందికి రాదని హైకోర్టు తేల్చి చెప్పింది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు భార్య వంట చేసేందుకు ఆస్కారం ఉండకపోవచ్చునని పేర్కొంది.

వంట చేయకుండా తన తల్లికి సహకరించడం లేదంటూ భార్య క్రూరత్వానికి పాల్పడిందన్న భర్త వాదన ఆధారంగా విడాకులు మంజూరు చేయడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. భార్య రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగం చేస్తారని, ఆమె వంట చేయకపోవడం భర్తను హింసిస్తున్నట్టుగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అత్త వంట చేసేప్పుడు భార్య సహకరించకపోవడం హింసించడం కిందికి రాదని తీర్పులో పేర్కొంది. భర్త మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 10 వరకు ఆఫీసు విధుల్లో ఉండగా, భార్య ఉదయం 9 నుంచి 6 గంటల వరకు ఉద్యోగం చేస్తున్నారని, ఈ పనివేళల నేపథ్యంలో ఉదయం వేళ భార్య వంట చేయడం ఎలా సాధ్యమని కోర్టు ప్రశ్నించింది. వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య చిన్ని గొడవలు సర్వసాధారణం అని, వాటిని పరిష్కరించుకోకుండా విడాకులు కోరడం సమంజసం కాదని కోర్టు సూచించింది.

## మళ్లీ వరంగల్‌కు వస్తే చెప్పులతో కొట్టిస్తా..కేటీఆర్‌కు ఎమ్మెల్యే నాయిని మాస్ వార్నింగ్




అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ వరంగల్ వేదికగా కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి తో పాటు రాహుల్ గాంధీ పై పరుష పదజాలంతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కేటీఆర్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ మాట తీరు, కవిత మహిళై ఉండి.. పీక కట్టలు కట్టారంటూ మాట్లాడటం చూస్తుంటే.. రానున్న రోజుల్లో కల్వకుంట్ల కుటుంబ బహిష్కరణ జరుగుతుందని జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని సోనియా గాంధీ కాళ్లు పట్టుకున్న వాళ్లే నేడు తిడుతున్నారని ఫైర్ అయ్యారు. అసలు గాంధీ ఫ్యామిలీ గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్ ఎక్కడున్నాడో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. అసలు కల్వకుంట్ల కుటుంబంలో ఉన్న వాళ్లే అతి చిల్లరగా తయారయ్యారని మండిపడ్డారు. తాము తిట్టడంలో పీహెచ్‌డీలు చేశామని.. ఆ పని తాము మొదలు పెడితే ఆత్మహత్య చేసుకుంటారని అన్నారు. రాబోయే రోజుల్లో కేటీఆర్ వరంగల్‌కు వస్తే చెప్పులతో కొట్టిస్తానని మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా కేటీఆర్ తన భాష తీరు మార్చుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హితవు పలికారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ.. మరో 26 మంది లొంగుబాటు

మావోయిస్టు పార్టీ కి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టులు ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిపై రూ.64లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మన్యంలో మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని, పునరావాసంతో పాటు రివార్డులు అందజేస్తామని ఎస్పీ కోరారు. కాగా, లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరంతా మావోయిస్టు పార్టీకి చెందిన మార్వార్ డివిజన్ మరియు PLGA కమిటీ సభ్యులని తెలిపారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల వరుస లొంగుబాట్లు, భీకర ఎన్‌కౌంటర్లు జరగడంతో చేసేదేంలేక లొంగిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎయిర్‌పోర్టులో హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

మొదటి పేజీ తరువాయి

విమానంలోని సీటు నంబర్లు 16, 17 వద్ద హైడ్రోపోనిక్ గంజాయిని వదిలివెళ్లినట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. విదేశాల్లో మట్టి లేకుండా సాగు చేసే ఈ ప్రత్యేక రకం గంజాయి సుమారు ఒక కిలో వరకు ఉన్నట్లు సమాచారం. పట్టుబడిన గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

విదేశాల్లో సాగు

తనిఖీలకు భయపడి నిందితులు విమానంలోనే గంజాయిని వదిలివెళ్లి పారిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో విదేశాల్లో సాగు చేసిన హైడ్రోపోనిక్ గంజాయిని భారత్‌కు అక్రమంగా తరలించే ప్రయత్నాలు పెరుగుతున్న నేపథ్యంలో, అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ తరహా మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో నిఘా మరింత కఠినతరం చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ తండ్రికి, ఎమ్మెల్యే కొడుకుకు నోటీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావు కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు రెండోసారి విచారించారు. ఆదివారం ఉదయం నుంచీ రాత్రి వరకూ విచారణ సాగింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులు ఆయనను ప్రశ్నించారు. 2024 సెప్టెంబర్‌లో 3 గంటలపాటు విచారించిన అధికారులు.. మొన్న దాదాపు 8 గంటలకు పైగానే ప్రశ్నల వర్షం కురిపించారు. కీలక అంశాలు రాబట్టారు. అన్నీ రికార్డు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ)లో పనిచేసిన ప్రభాకర్‌రావు బృందంతో సంబంధాలపై ఆరా తీశారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్లు సమకూరిన విషయంలో నవీన్‌రావు పాత్ర ఏంటి, ఆ సొమ్ముతో ఫోన్ అక్రమ ట్యాపింగ్ అంశానికి సంబంధముందా అన్న కోణంలో విచారించారు. అయితే.. తాజాగా నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.


## కేసీఆరే గెలవాలని 90 శాతం వైసీపీ క్యాడర్ కోరుకుంటోంది !

వైసీపీ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ వైసీపీ క్యాడర్ కేసీఆర్ గెలవాలని కోరుకుంటున్నట్లు షాకింగ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కేతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ ఓటమిపై కీలక వ్యాఖ్యలు చేసిన కేతిరెడ్డి, గులాబీ పార్టీ ప్రస్తావన కూడా తీసుకువచ్చారు. 80 నుంచి 90 శాతం గులాబీ క్యాడర్, ఏపీలో వైసీపీ పార్టీ గెలవాలని కోరుకుంటోందని వెల్లడించారు. అదే సమయంలో 80 నుంచి 90 శాతం వైసీపీ కార్యకర్తలు కూడా తెలంగాణలో గులాబీ పార్టీ గెలవాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.ముందు నుంచి కేటీఆర్, కేసీఆర్ లతో వైయస్ జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయని ఈ ఇంటర్వ్యూలో కేతిరెడ్డి షాకింగ్ నిజాలను బయటపెట్టారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఇద్దరు గురువు శిష్యులని, అందుకే వాళ్ళను ఓడించాలని వైసీపీ, గులాబీ పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నట్లు వెల్లడించారు.ఏపీలో వైసీపీ క్యాడర్ పైన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని ఫైర్ అయ్యారు. అటు గులాబీ పార్టీ కార్యకర్తల పైన రేవంత్ రెడ్డి కూడా కేసులు పెడుతున్నట్లు చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఇరు పార్టీలకు న్యాయం జరుగుతుందని పరోక్షంగా హింట్ ఇచ్చారు కేతిరెడ్డి. దీంతో ఆయన చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. కాగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 సీట్లకే పరిమితమై, అధికారం కోల్పోయింది. అటు జగన్ పార్టీకి 11 సీట్లే వచ్చాయి.

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.. ఎమ్మెల్యే షాకింగ్ కామెంట్స్

బీజేపీ సీనియర్ నేత, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజకీయాల నుంచి ఎప్పుడో తప్పుకుందామని అనుకున్నాను. అందరూ కోరుకోవడంతో పాటు మీరే పోటీ చేయాలని బలవంతం చేయడంతో 2024 ఎన్నికల్లో పోటీ చేశాను. అనూహ్యంగా ఈసారి ఎవరూ ఊహించని విధంగా భారీ మెజారిటీ కూడా వచ్చింది. భవిష్యత్‌లో నేను, నా కుటుంబం నుంచి ఎవరం ఎన్నికల్లో పోటీ చేయం. రాజకీయాలకు అతీతంగా మంచి పనులు చేసి పేరు తెచ్చుకుంటా. ఇక నుంచి నియోజకవర్గంలో ఎవరైనా అన్యాయం, అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించబోం' అని కామినేని శ్రీనివాస రావు హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. మంగళవారం సంక్రాంతి పండుగ నేపథ్యంలో 'జూదాలు వద్దు – సాంప్రదాయ క్రీడలే ముద్దు' అని కామినేని నినాదించారు.

## ఆందోళనకారులపై దూసుకెళ్లిన బస్సు.. పది మంది మృతి



ఇజ్రాయెల్ రాజధాని జెరూసలేం లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం జెరూసలేంలో సైనిక నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలియజేశారు. వేలాది మంది హాజరైన ప్రదర్శనలో పురుషుల గుంపుపైకి ఓ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో దాదాపు పదిమంది యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, రెండు సంవత్సరాల సుదీర్ఘ యుద్ధం తర్వాత సైన్యం మానవశక్తి కొరతను ఎదుర్కొంటున్నది. ఈ క్రమంలోనే పౌరులను బలవంతంగా సైన్యంలో చేర్చుకుంటున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లమీదకు వచ్చిన నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే అనుకోని ప్రమాదం జరిగి పదుల సంఖ్యలో ప్రజలు మృతిచెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 12 మీటర్ల నేషనల్ హైవే కబ్జా?

## - అధికారుల వైఫల్యంపై ఆకుల సతీష్ ధ్వజం

- ఎమ్మెల్యే అనుచరుడి అండతో 12 మీటర్ల హైవే కబ్జా చేసి అక్రమ లిక్కర్ షాప్ నిర్మాణం
- ఫిర్యాదులు చేసినా డిప్యూటీ కమిషనర్ మల్లయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణ
- అక్రమ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు, ఇటీవల ఘోర రోడ్డు ప్రమాదం
- అక్రమ లిక్కర్ షాప్ కూల్చివేయాలి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్న డిమాండ్
- 7 రోజుల్లో చర్యలు లేకపోతే జోనల్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక

ఇది కద నిజం: ఖుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ నేషనల్ హైవేపై సాగుతున్న భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై ఆకుల సతీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుడి అండదండలతో ఏకంగా 12 మీటర్ల నేషనల్ హైవేను కబ్జా చేసి అక్రమంగా లిక్కర్ షాప్ నిర్మించడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. ఈ అక్రమ నిర్మాణంపై ముందే ఫిర్యాదులు చేసినప్పటికీ, గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం నేరపూరిత నిర్లక్ష్యమని మండిపడ్డారు. ఈ అక్రమ కట్టడం వల్లే హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి, తాజాగా ఒక కారును డీసీఎం వాహనం ఢీకొట్టి భారీ ప్రమాదం జరిగిందని, అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇక్కడ ప్రాణనష్టం జరిగితే ఎమ్మెల్యే బాధ్యత వహిస్తారా లేక అధికారులు సమాధానం చెబుతారా అని నిలదీశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అక్రమాలకు సహకరించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు.

ఈ క్రమంలో ఆకుల సతీష్ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు. దుండిగల్ హైవేపై ఉన్న అక్రమ లిక్కర్ షాపును వెంటనే కూల్చివేయాలని, అవినీతికి సహకరించిన డిప్యూటీ కమిషనర్ మల్లయ్యను తక్షణమే సస్పెండ్ చేసి అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హైవే ఆక్రమణపై పూర్తిస్థాయి విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు. రాబోయే 7 రోజుల్లో అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే, వేలాది మంది ప్రజలతో కలిసి జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఇది కేవలం రాజకీయ ప్రకటన కాదని, ప్రజల ప్రాణాల రక్షణ కోసం చేస్తున్న పోరాటమని ఆకుల సతీష్ & టీం స్పష్టం చేశారు.




## భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి



ఇది కద నిజం,తాండూరు: తాండూర్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాల సముదాయాన్ని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఎంతో పేరుప్రతిష్టలు ఉన్న ఈ దేవాలయం అభివృద్ధి విషయంలో గత పాలకులు కేవలం మాటలకే పరిమితమయ్యారని, కానీ తాము ఆచరణలో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఒక వృద్ధురాలి కోరిక మేరకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, అందరి సహకారంతో 'దాసోహం' భవనాన్ని నిర్మించామని ఆయన గుర్తు చేశారు.

గత నాయకుల లాగా కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నేడు 17 షాపుల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, మొత్తం 64 షాపుల నిర్మాణాన్ని అతి త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే సమాజం నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు త్వరలోనే వేద పాఠశాలను కూడా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కొంతమంది ఈ అభివృద్ధిని అడ్డుకోవాలని హైకోర్టుకు వెళ్లినప్పటికీ, స్వామి వారి ఆశీస్సులు ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన 7వ గ్యారంటీ ప్రకారం వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వకుండా నేడు అమలు చేసి చూపిస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులకు మరియు వీరశైవ సమాజం వారికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వంటగదిని ప్రారంభించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఇది కద నిజం, యాదాద్రి: యాదగిరిగుట్ట ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగదిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ఈ వంటగది ద్వారా మధ్యాహ్న భోజన పథకం మరింత సమర్థవంతంగా అమలవుతుంది. పాఠశాల భద్రత, సౌకర్యాల దృష్ట్యా త్వరలోనే పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాల కోసం స్టేజీ నిర్మాణం కూడా చేపడతాం. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తాండూరులో నకిలీ సర్టిఫికెట్ల దందా.. నిందితుడి అరెస్ట్!




ఇది కద నిజం, వికారాబాద్: తాండూరు పట్టణంలో అక్రమ మార్గంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ఒక ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. అసలు పత్రాలను పోలి ఉండేలా నకిలీ జనన, మరణ ధృవీకరణ పత్రాలను సృష్టిస్తున్న ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మొదట ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ల నుండి ఒరిజినల్ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసేవాడు. అనంతరం ఫోటోషాప్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి వాటిలోని వివరాలను మార్చి, కస్టమర్లకు నకిలీ పత్రాలను విక్రయించేవాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ ముద్రలు, సంతకాలను సైతం ఫోటోషాప్ ద్వారా సృష్టించి ప్రజలను నమ్మిస్తూ ఈ దందా సాగిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతని వద్ద నుండి నకిలీ పత్రాల తయారీకి ఉపయోగించిన కంప్యూటర్ ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దీని వెనుక ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



ఇది కద నిజం, మహబూబ్ నగర్ :సమ సమాజ నిర్మాణం మరియు బహుజనుల రాజ్యాధికారం లక్ష్యంగా డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లక్ష కిలోమీటర్ల "మా భూమి రథయాత్ర" పున'ప్రారంభం కావడం శుభపరిణామమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బాలయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ యాత్ర బహుజన గుండెల్లో చైతన్యాన్ని నింపుతూ విజయవంతంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బాలయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, విశారదన్ మహారాజ్ తలపెట్టిన ఈ మహత్కార్యానికి దైవకృప తోడవ్వాలని, వారికి ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు చేకూరాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. బహుజన వర్గాల ఆత్మగౌరవం కోసం, భూమి హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం సఫలీకృతం కావాలని, తద్వారా వారు కలలుగన్న "ప్రజా రాజ్యం - బహుజన రాజ్యం" సాకారం కావాలని ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ యాత్ర ద్వారా అణగారిన వర్గాల గొంతుకను వినిపిస్తున్న మహరాజ్ కి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏసీబీ వలలో మూడు అవినీతి తిమింగలాలు..!

- మొదట 5లక్షల లంచం డిమాండ్..!
- రెండున్నర లక్షలకు డీల్. !
- ముందే లక్షయాభై అడ్వాన్సుగా తీసుకున్న అధికారులు.!
- లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ..



ఇది కద నిజం: రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో ఓ భవన నిర్మాణానికి అనుమతి కోసం ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి చెన్నయ్య ,ఎంపీఓ తేజ్ సింగ్, ఎంపీడీవో సుమతి, ముగ్గురి సమక్షంలో మొట్ట మొదట ఐదు లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. రెండున్నర లక్షలకు డీల్ కుదుర్చుకోగా ముందే లక్ష యాభై వేల రూపాయలు అడ్వాన్స్ గా తీసుకున్నారు మిగతా లక్ష రూపాయలు బుధవారం నాడు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా రంగారెడ్డి జిల్లా ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు సాక్షాత్తు నందిగామ ఎంపీడీవో కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## TASK-MATA ఆధ్వర్యంలో 600 మంది గ్రామీణ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ శిక్షణ




ఇది కద నిజం: తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరైన కార్యక్రమంలో, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (TASK) మరియు మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (MATA) సంయుక్తంగా నిర్వహించిన కాన్వొకేషన్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నలుమూలల నుండి వచ్చిన 600 మంది గ్రామీణ విద్యార్థులకు 'Microsoft ఆధారిత జావా బూట్‌క్యాంప్'లో శిక్షణ పూర్తి చేసుకున్నందుకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మాతా ( MATA) ప్రెసిడెంట్ కిరణ్ దుగ్గాడి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ విజయ్ భాస్కర్ కలాల్, సెక్రటరీ శ్రీధర్ గుడాలఖర మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు మల్లిక్ రావు బొల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా అత్యాధునిక సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను అందించడం అభినందనీయమన్నారు. MATA సంస్థ అందిస్తున్న ఆర్థిక సహకారం, TASK కల్పిస్తున్న శిక్షణా వేదిక కలవడం వల్ల విద్యార్థులు ప్రపంచస్థాయిలో ఉద్యోగాలు సాధించేలా రాటుదేలుతారని ఆయన ఆకాంక్షించారు. ఈ శిక్షణ విద్యార్థుల జీవితాలను వృత్తిపరంగా ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని, భవిష్యత్తులో ఐటీ రంగంలో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

MATA బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మరియు ఇండియా కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ భాస్కర్ బోల్గాం మాట్లాడుతూ.. భారతదేశంలో MATA సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ప్రతీ ఎన్‌ఆర్‌ఐ (NRI) తమ సొంత గ్రామాన్ని దత్తత తీసుకుని, గ్రామాభివృద్ధి, విద్య మరియు ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులను గ్లోబల్ ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఇందుకోసం ప్రభుత్వ సంస్థలతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం



ఇది కద నిజం, స్వర్ణగిరి: ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ.అంగరంగ వైభవంగా జరిగిన వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం.వైభవంగా జరిగిన స్వామివారి తిరువీధి ఉత్సవం. విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయణం పుష్య మాసం కృష్ణ పక్షము హేమంత ఋతువు చవితి బుధవారం జనవరి 07వ తేది.కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాత'కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది.

సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది.ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయమే శ్రీ ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈరోజు బుధవారం సందర్భంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదారవిందములకు ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో,శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ చేయడం జరిగింది. భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆనంద పరవశు లైనారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అష్ట లక్ష్మి మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

---

### యాదగిరిగుట్టలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన
## ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఇది కద నిజం: యాదగిరిగుట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిశీలించారు. భోజన నాణ్యతపై అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పలువురి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు.

---

# న్యాయం చెప్పిన వ్యక్తిపైనే నిందలా?

- కూతురిదే తప్పని స్పష్టం చేసిన వృద్ధ దంపతులు
- కీలక మలుపు తిరిగిన కుల బహిష్కరణ కేసు
- తప్పు అని చెప్తే కేసు పెట్టింది: కరేటి అప్పారావు




ఇది కద నిజం, కుక్కునూరు: తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు తమ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశాడంటూ ఓ మహిళ పెట్టిన కేసు కీలక మలుపు తిరిగింది. తమ బిడ్డ, ఆమె కుటుంబ సభ్యులు కలసి చిత్రహింసలకు గురిచేస్తున్నారని, తప్పు అని చెప్పిన కుల పెద్దపై అసత్య ఆరోపణలు చేస్తూ కేసు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తూ వృద్ధ దంపతులు మీడియా ముందు కన్నీరుమున్నీరు అయిన ఘటన కుక్కునూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని వింజరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కరేటి ముత్తయ్య, చిట్టెమ్మ దంపతులు తన కూతురు పెట్టిన 'కుల బహిష్కరణ' కేసుపై మాట్లాడుతూ.. తమ బాగోగులు చూసుకోవాల్సిన కూతురే.. కుటుంబ సభ్యులతో కలిసి బెదిరిస్తుందని తెలిపారు. అంతేకాదు, ఎన్నోసార్లు తమపై దాడి చేసిందని చెప్పారు. ఇదే విషయంపై మూడు నెలలుగా గొడవలు జరుగుతున్నాయని, ఈ కారణంగా తాము కుల పెద్ద అయిన తెలుగుదేశం పార్టీకి చెందిన కరేటి అప్పారావును ఆశ్రయించామని వెల్లడించారు. ఆయన గొడవలు లేకుండా సర్ది చెప్పే ప్రయత్నం చేస్తే.. అప్పారావే తమ కుటుంబాన్ని 'కుల బహిష్కరణ' చేశారనే ఆరోపణలు చేస్తుందని వృద్ధ దంపతులు వివరించారు.

ఇదే విషయంపై గ్రామ పెద్దలు స్పందిస్తూ.. ఈ గొడవల విషయమై ఇరు వర్గాలనూ పంచాయతీకి పిలిచినట్లు చెప్పారు. కానీ, దీనికి వృద్ధులు హాజరవగా.. మంగమ్మ మాత్రం నిరాకరించిందని వెల్లడించారు. అంతేకాదు, పంచాయతీని, కులాన్ని బహిష్కరిస్తున్నానని తెగేసి చెప్పిందని, పైగా కుల పెద్దలనే దుర్భాషలాడుతూ మాట్లాడిందని వివరించారు. అలాగే, వృద్ధ దంపతులకు చెందిన 30 గొర్రెలను వారికి అప్పగించాలని మంగమ్మకు చెప్పినట్లు కుల పెద్దలు తెలిపారు. అయితే, మంగమ్మ మాత్రం 16 గొర్రెలనే వృద్ధులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత వృద్ధులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించిన పెద్ద మనుషులను మంగమ్మ తిట్టడంతో పాటు, కులం నుంచి బహిష్కరించారని తప్పుడు కేసు పెట్టిందని కుల పెద్దలు ఆమె ఆరోపణలను ఖండించారు. ఇదిలా ఉండగా.. కరేటి అప్పారావు అనే టీడీపీ నాయకుడు తనను కులం నుంచి బహిష్కరణ చేశాడంటూ మంగమ్మ ఆరోపణలు చేసింది. దీనిపై ఆమె పోలీసులకు సైతం కంప్లైంట్ ఇచ్చింది. అయితే, సదరు మహిళ తల్లిదండ్రులు మాత్రం ఆ ఆరోపణలను ఖండించడం కొసమెరుపు.

**తప్పు అని చెప్తే కేసు పెట్టింది: కరేటి అప్పారావు**

నేను ఏలూరు జిల్లా యాదవ సంఘం కార్యదర్శిగా ఉన్నాను. మా వింజరం గ్రామంలో మంగమ్మ అనే మహిళ తన తల్లిదండ్రులను కొడుతోంది. దీంతో మా కుల సంఘం తరపున వెళ్లి వాళ్లను ఎందుకు కొడుతున్నావని అడిగాను. దీనికామె "నా తల్లిదండ్రులు నా ఇష్టం. నేను కొట్టుకుంటా.. చంపుకుంటా.. మీకు సంబంధం ఏంటి?" అంటూ ఎదురు తిరిగింది. అది తప్పు అని ఖండించిన మాపై కుల బహిష్కరణ చేశారంటూ మంగమ్మ తప్పుడు ఆరోపణలు చేసింది. అంతేకాకుండా కేసు కూడా నమోదు చేయించింది. దీనిని యాదవ కుల సంఘం తరపున ఖండిస్తున్నాం.

---

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు
# ప్రభుత్వానివా? పార్టీలవా?

**- టీజేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్ డిమాండ్**



ఇది కద నిజం,వికారాబాద్: తెలంగాణలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాలా లేక రాజకీయ పార్టీల అడ్డాలా అనే అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని తెలంగాణ జేఏసీ (ఎజీూజ) వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు. పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుని ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. అదేవిధంగా వికారాబాద్, తాండూరు కార్యాలయాల్లోనూ పార్టీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటనలు రావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భవనాలు ప్రభుత్వ నిధులతో ప్రజల సౌకర్యార్థం నిర్మించినవని గుర్తు చేశారు. ఒకవేళ ఇవి రాజకీయ పార్టీ కార్యాలయాలే అయితే, గతంలో పనిచేసిన మాజీ ఎమ్మెల్యేల పార్టీలకు మరియు ఇతర రాజకీయ పక్షాలకు కూడా అక్కడ సమావేశాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరారు. అలా కాకుండా ఇవి కేవలం ప్రభుత్వ కార్యాలయాలే అయితే, రాజకీయాలకు అతీతంగా కేవలం ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా, నియోజకవర్గ అభివృద్ధి కేంద్రాలుగా మాత్రమే కొనసాగేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రజా సేవకే ప్రాధాన్యత ఉండాలి**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల అసలు ఉద్దేశ్యం ప్రజా సేవ అని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడానికి ఇవి ఒక వారధిలా పనిచేయాలని నాగేశ్వర్ పేర్కొన్నారు. రెండు అంతస్తుల భవనాల్లో నిర్మించిన ఈ కార్యాలయాల్లో వివిఐపి లాంజ్, సమావేశ మందిరం వంటి వసతులు కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకు, అధికారులతో సమీక్షలకు మరియు అభివృద్ధి పనుల పర్యవేక్షణకు మాత్రమే ఉపయోగించాలని ఆయన సూచించారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఆరోగ్య, విద్యా, ఉద్యోగ సమస్యలను పరిష్కరించే వేదికలుగా ఉండాల్సిన ఈ కేంద్రాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ప్రజల పక్షాన ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన వివరణ ఇచ్చి, క్యాంపు కార్యాలయాల పవిత్రతను కాపాడాలని ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు.

---

### రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను
# జీహెచ్ఎంసీలో కలపవద్దు

- ప్రజాభిప్రాయం లేకుండా విలీనం సరికాదు:వెంకటేష్
- అవసరమైతే సైబరాబాద్‌లో కలపాలి
- ప్రాంత అభివృద్ధికి సైబరాబాద్ మేలు
- ప్రభుత్వం ప్రతిపాదన ఉపసంహరించాలి
- లేకపోతే బీజేపీ ఆందోళనలు



ఇది కద నిజం, అత్తాపూర్: రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (GHMC)లో విలీనం చేయాలనే ప్రతిపాదనపై అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ మాట్లాడుతూ, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఈ సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఒకవేళ పరిపాలనా సౌలభ్యం కోసం ఈ రెండు సర్కిళ్లను విలీనం చేయాల్సి వస్తే, వాటిని సైబరాబాద్ కార్పొరేషన్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ ప్రాంతాల భవిష్యత్తు మరియు అభివృద్ధి దృష్ట్యా సైబరాబాద్‌లోనే కొనసాగించడం సమంజసమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, స్థానిక ప్రజల ప్రయోజనాల కోసం ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని సుల్గే వెంకటేష్ హెచ్చరించారు. లేనిపక్షంలో బీజేపీ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

---

# ఆసిఫ్‌నగర్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




ఇది కద నిజం, ఆసిఫ్‌నగర్: జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా ఈరోజు ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ డి. ధనలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి కాలేజ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్ సైన్‌లపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అలాగే వేగ నియంత్రణ, రాంగ్‌రూట్ నివారణ, పాదచారుల భద్రతపై ప్రత్యేకంగా వివరించారు.అనంతరం పిల్లర్ నంబర్23 వద్ద ప్లకార్డుల ప్రదర్శన, ఫ్లెక్సీల ద్వారా రహదారి భద్రతపై సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రయాణికులకు పాంప్లెట్లు పంపిణీ చేసి ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు పిలుపునిచ్చారు.

---

# ఆలేరు నియోజకవర్గంలో ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలు ప్రారంభం



ఇది కద నిజం,ఆలేరు: ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు బాల బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ సాయుధ పోరాట నాయకులు డా. ఆరుట్ల కమలాదేవిరామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ స్థాయి ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలు 20252026 ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండ్రు శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. అదేవిధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు, ఆత్మకూర్ సర్పంచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆరుట్ల దంపతుల త్యాగాలు, సేవలను వక్తలు స్మరించుకున్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందిస్తాయని తెలిపారు. యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరుట్ల శుశీల దేవి, శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.